
సాక్షి ఒడిశా

గురువారం । 15 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,14,984లు, బంగారం 210మిల్లీగ్రాములు, వెండి 21.43 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



సంప్రదాయ సందడి

● రాష్ట్రవ్యాప్తంగా రొజ్జో సంక్రాంతి సంబరాలు

- 4లో.



ఎన్నాకెన్నాళ్లకు..!

- 4లో.

న్యూస్‌రీల్

సీఎంకు ప్రైవేట్ డ్రైవర్ల కృతజ్ఞతలు



కొరాపుట్: అసంఘటిత రంగంలో విధులు నిర్వహిస్తున్న తమకు బీమా సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ప్రైవేట్ డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు నవరంగ్‌పూర్‌లో ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తమ డిమాండ్ల మేరకు సీఎం స్పందించి, బీమా కల్పించడంపై హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీజేడీ యువత జోనల్ అధ్యక్షుడు తపస్ త్రిపాఠి, పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ త్రిపాఠి పాల్గొన్నారు.

'క్రియాశీల రాజకీయాల్లో పనిచేస్తా'



మీడియాతో మాట్లాడుతున్న జనార్దనరావు

పర్లాకిమిడి: దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయిక్ ఆదర్శంతో బీజేడీలో చేరానని, అధిష్టానం టికెట్ కేటాయిస్తే క్రియాశీలక రాజకీయాల్లో పాల్గొని ప్రజలకు సేవ చేస్తానని బర్నాల జనార్దనరావు అన్నారు. పర్లాకిమిడిలోని కృష్ణానగర్‌లో ఉన్న తన స్వగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీడీఏలో అకౌంటెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన తాను.. బిజూ పట్నాయక్ జయంతి సందర్భంగా పార్టీలో చేరానని గుర్తు చేశారు. రాజకీయాల్లో చేరక ముందే ప్రజలతో సాన్నిహిత్యం ఉందని, సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి టికెట్ వచ్చినా, రాకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రస్తుతం చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి కార్యదర్శిగా ఉంటున్న జనార్దనరావు.. బీజేడీ తరఫున టికెట్ ఆశించిన వారి రేసులో ఉన్నారు.

30కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పోలీసుల అదుపులో నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీస్ స్టేషన్ పరిధి కుదుములగుమ్మ పంచాయతీ పభిగెడ గ్రామం వద్ద పోలీసులు మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహించారు. అదే సమయంలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు అతి వేగంగా రావడాన్ని గమనించారు. ఈ మేరకు వాహనాన్ని తనిఖీ చేయగా.. 2బస్తాల్లో గంజాయిని పట్టుబడింది. ఈ మేరకు రంగసీగూడ గ్రామానికి చెందిన నాద ఖీలో(33), దూర్మాగూడ గ్రామానికి చెందిన అర్జున్ బాడమాని(28)ని అరెస్ట్ చేసి, బుధవారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు. వారి వద్ద నుంచి 30కిలోల గంజాయి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సరుకు విలువ రూ.లక్ష 60 వేలు ఉంటుందని ఐఐసీ రాఘునాథ్ మాఝి తెలిపారు.

ఉద్యోగుల నిరసనలు



మజ్జిగౌరి మందిరం ప్రాంగణంలో దీపాలు వెలిగించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

రాయగడ: రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు వినూత్న పద్ధతిలో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రేడ్‌పే ఉద్యోగులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో జిల్లా అమలా సంఘం సభ్యులు స్థానిక మజ్జిగౌరి మందిర ప్రాంగణంలో బుధవారం దీపాలు వెలిగించి, వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధనకు పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని వేడుకున్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే విధంగా ఆశీర్వదించమని కోరారు. మిషన్ గ్రేడ్‌పే రూ.4,200లు ప్రభుత్వం ఇచ్చేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టంచేశారు. నిరసనలో అమలాసంఘం చైర్మన్ అరుణ్‌కుమార్ గోపీనాథ్ రౌత్, జిల్లా అధ్యక్షుడు మనోజ్ రౌత్, ఉద్యోగులు పాల్గొన్నారు.

- డీసీసీ అధ్యక్ష నియామకంపై ఎమ్మెల్యే తారాప్రసాద్ అభ్యంతరం
- ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసేందుకు పయనం
- వెంట వెళ్లిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు



అందరి చూపు.. హస్తిన వైపే!

జయపురం: కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా దుర్గాశంకర సాహు(బుల్లు) నియామకంపై పార్టీలో తలెత్తిన వివాదం ఢిల్లీకి చేరుతోంది. ఈ నియామకంతో కొరాపుట్ ఎంపీ, జయపురం ఎమ్మెల్యేల మధ్య గత నాలుగేళ్లగా నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు భగ్గుమన్నాయి. దీంతో జిల్లాలో హస్తం పార్టీ రెండుగా చీలిందనే చెప్పవచ్చు. పీసీసీ అధ్యక్షుడు తన విజ్ఞప్తిని బేఖాతరు చేసి, ఎంపీ సప్తగిరి శంకర ఉల్క చెప్పినట్లుగా మరొకరిని జిల్లా అధ్యక్షుడిగా నియమించటంతో ఈ సమస్యను ఢిల్లీ పెద్దలతోనే తేల్చుకోవాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి నిర్ణయించారు. దీనికి అనుగుణంగా ఆయన మంగళవారం రాత్రే దేశ రాజధానికి పయనమయ్యారు. స్థానిక సబ్ డివిజన్‌కు చెందిన పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు, మద్దతుదారులు ఆయన వెంట వెళ్లారు. పార్టీ అధిష్టానం ముందు కొరాపుట్ జిల్లా కాంగ్రెస్‌లో తలెత్తిన సమస్యను పరిష్కరించాలని కోరవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. ఎంపీ తీరుకు వ్యతిరేకంగా అగ్ర నేతల ముందు ఆరోపణలు సైతం వినిపించవచ్చని సమాచారం. ఢిల్లీ వెళ్లిన వారిలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుకాంత పట్నాయక్, బొరిగుమ్మ బ్లాక్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ గంతాయిత్, మరో 13మంది కొరాపుట్ జిల్లా పరిషత్ సభ్యులు, పార్టీకి చెందిన పంచాయతీ సర్పంచ్‌లు, సమితి అధ్యక్షులు, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు. ఒకవేళ కేంద్ర నాయకత్వం ఎమ్మెల్యే వర్గాన్ని సంతృప్తి పరచకలేకపోతే.. పార్టీకి సామూహిక రాజీనామాలు చేసేందుకు వెనుకాడరని సమాచారం. దీంతో అందరి చూపు హస్తిన వైపే మళ్లింది.

పూర్వవైభవం ఖాయం..

రాయగడ: జిల్లాలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయమని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అన్ని స్థానాల నుంచి విజయ దుందుభి మోగిస్తుందని కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉల్క అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడిగా బిజయకుమార్ గమాంగొ నియమితులైన సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో గమాంగొను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏఐసీసీ సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్న నేపథ్యంలో రాయగడ జిల్లాలో కాంగ్రెస్‌కు పూర్వవైభం వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయన్నారు. అయితే దీనికి అంతా కలసికట్టుగా కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. బిజయ్ గమాంగొ సారథ్యంలో పార్టీ అంచెలంచెలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌కు గతంలో ఎన్నో సేవలందించిన సమర్థత కలిగిన వ్యక్తి గమాంగొను పార్టీని విజయ పథంలో నడిపించేందుకు నడుం బిగించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సాధారణ కార్యదర్శి దుర్గాప్రసాద్ పండా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్తలతో ఎంపీ సప్తగిరి, నాయకులు

ఆదివాసీ మహిళలతో రాష్ట్రపతి భేటీ



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జిల్లాకే చెందని ఆదివాసీ మహిళలు

రాయగడ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జిల్లాకు చెందిన డొంగిరియా, లంజియా సవర తెగలకు చెందని ఆదివాసీ మహిళలు భేటి అయ్యారు. రెండు రోజుల క్రితం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో అఖిల భారతీయ ఆదిమజన ప్రజల సమావేశం జరిగింది. కేంద్ర ఆదివాసీ మంత్రిత్వశాఖ ఈ మేరకు జిల్లాలోని కల్యాణసింగుపూర్ సమితి నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగిరియా తెగకు చెందిన 17మంది, గుణుపూర్ సబ్‌డివిజన్ పరిధిలోని పుటాసింగి ప్రాంతంలో నివాసిస్తున్న లంజియా సవర తెగకు చెందిన 10మంది మహిళలను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఢిల్లీకి చేరిన వీరంతా.. అక్కడి పార్లమెంట్ నూతన భవనాన్ని సందర్శించారు. అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లాను కలుసుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యానవనంలో రాష్ట్రపతితో కలిసిన వీరంతా రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయి అనందించారు. ఈ క్రమంలో కొంతమంది లంజియా సవర మహిళలు వారి సంప్రదాయ కుయి భాషలో పాటలు పాడి మైమరిపించారు. కార్యక్రమంలో కేంద్ర ఆదివాసీ సంక్షేమశాఖ మంత్రి అర్జున్ ముండ తదితరులు పాల్గొన్నారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికారులు బుధవారం మీడియాకు వెల్లడించారు.

జగన్నాథ సాగర్ అభివృద్ధి పనులపై సమీక్ష



పనులపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ మహ్మద్ అక్తార్

జయపురం: చరిత్రాక జగన్నాథసాగర్ అభివృద్ధి పనులనుజిల్లా కలెక్టర్ అబ్దుల్ మమ్మద్ అక్తార్ బుధవారం సమీక్షించారు. అనంతరం జగన్నాథ సాగర్‌ను పరిశీలించారు. కొత్త వీధి నుంచి నిర్మిస్తున్న 1127 మీటర్ల డ్రైన్‌ను తనిఖీ చేసి, పంచానన మందిరం వరకు నిర్మించాలని ఆదేశించారు. పరిశీలనలో జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, మైనర్ ఇరిగేషన్ విభాగ ఇంజినీర్ నిహారరంజన్ బెహరా, మున్సిపల్ ఈఓ తదితరులు పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ప్రమాదం

- నిలిచిన ఉత్పత్తి.. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

జయపురం: కొరాపుట్ జిల్లాలోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్ ప్రాజెక్టులో మంగళవారం రాత్రి అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. దీనివల్ల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదనకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. 3వ నంబర్ జెనరేటర్‌లో ప్రమాదం జరగడంతో యూనిట్ పూర్తిగా దెబ్బతింది. ప్రమాదం వల్ల ప్రాజెక్టులోని టర్బైన్లు పని చేయకుండా నిలిచిపోయాయి. దీని ప్రభావం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పాదనపై చూపింది. అయితే ప్రమాదానికి కారణం తెలియలేదు. ఘటన జరిగిన వెంటనే విద్యుత్ ఉత్పాదన చేసేందుకు యుద్ధ ప్రాతిపదిన పునరుద్ధరణ పనులు చేపట్టారు. ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ తోపాటు ఇంజినీర్లంతా పనుల్లో మమేకమయ్యారు. బుధవారం ఉదయం నుంచి 1వ నంబర్ జనరేటర్ పని చేస్తోందని, విద్యుత్ ఉత్పాదన సైతం ప్రారంభమైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టులో 2, 4, 5, 6 జెనరేటర్ల పనుల్లో సిబ్బంది నిమగ్నం కాగా.. మరో 1, 2 రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి, పూర్తిస్థాయిలో ఉత్పాదన జరగనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.



పేలుడు ధాటికి ధ్వంసమైన 3వ జనరేటర్ టర్బైన్

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

- ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో



పోలీసులు స్వాధీనం చేసుకున్న మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నక్కమమ్ముడి పంచాయతీ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతి చెందగా, అందులో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పూర్తి వివారాలు ఇలా ఉన్నాయి. రస్‌బెడ పంచాయతీ గాదిపుట్ గ్రామానికి చెందిన ఐదుగురు మంగళవారం ఉదయం ఆటోలో చిత్రకొండ సమితి సిడిపాక గ్రామానికి వెళ్లారు. మార్గం మధ్యలో ఆటో మరమ్మతులకు గురి కావడంతో రాత్రి 11 గంటల సమయంలో వేరు వాహనంలోకి మారారు. బలిమెల-నక్కమమ్ముడి ఘటీలోకి చేరుకొనే సరికి ఆటో బ్రేక్ విఫలమై, బోల్తా పడింది. దీంతో డ్రైవర్ ఆశిస్ చక్రవర్తి(35) కింద పడిపోగా, తల బండరాయికి బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మిగతా వారికి గాయాలు కావడంతో బలిమెల పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ రాఘునాథ్ మాఝి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మృతుడిది ఎంవీ-37 గ్రామం గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, బుధవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రక్తదాతలే.. ప్రాణదాతలు



రక్తదాన దాతలకు సన్మానిస్తున్న సీడీఎంఓ రౌత్రాయ్

- ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో వక్తలు

రాయగడ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి, సకాలంలో ఆదుకున్న వారంతా భగవంతుడితో సమానులని జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్ అన్నారు. ప్రపంచ రక్తదానం దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని భారిజోలలో ఉన్న సీడీఎంఓ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది అవగాహన రాహిత్యంతో రక్తదానం చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. వారిలో చైతన్యం కలిగించాలని సూచించారు. స్థానిక అబ్దుల్‌కలాం ఫౌండేషన్‌కు చెందిన ఎంతోమంది సభ్యులు రక్తదానం చేసి, తమ సేవా భావాన్ని చాటుకుంటున్నారని అభినందించారు. అనంతరం ఫౌండేషన్‌కు చెందిన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఎం(పబ్లిక్‌హెల్త్) డాక్టర్ వి.లోక్‌నాథ్ రాజు, డాక్టర్ మమత చౌధరి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహోన్నతం..

పర్లాకిమిడి: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రాస్పత్రిలో గజపతి రక్తదాత సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాజేంద్ర మింజ్, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో దీనిని ప్రారంభించారు. శిబిరంలో 60 యూనిట్ల రక్తాన్ని సేకరించి, బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ఈ రక్తాన్ని అందిస్తామని, ఇది మహోన్నత కార్యక్రమమని సీడీఎంఓ తెలిపారు. కార్యక్రమంలో రక్తదాతల సంఘం అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు ఎస్.రుషి, కార్యదర్శి వై.చంద్రశేఖర్, జగత్‌మోహన్ సాహు, కె.శరత్‌కుమార్, మమతా పాఢి, కోన నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: శిబిరంలో ఏడీఎం రజేంద్ర మింజ్, సీడీఎంఓ, రక్తదాతలు

నవీన్ పాలన దారుణం



మీడియా సమావేశంలో పురంధేశ్వరి, బలభద్ర మాఝి

- కేంద్రం చర్యలు భేష్: విశ్వేశ్వర టుడు, పురంధేశ్వరి

కొరాపుట్: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ పాలన ఎంతో ప్రజా రంజకంగా ఉందని భారతీయ జనతా పార్టీ జాతీయ సాధారణ కార్యదర్శి, ఒడిశా వ్యవహారాల బాధ్యురాలు దగ్గుపాటి పురంధేశ్వరి అన్నారు. నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సర్క్యూట్ హౌస్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ పాలనకు 9ఏళ్లు పూర్తయ్యిందని, ఈ వ్యవధిలో దేశంలో ఎన్నో మార్పులు తీసుకు వచ్చామన్నారు. సైనికంగా, ఆర్థికంగా, రవాణాలో తిరుగులేని విజయాలు సాధించామని తెలిపారు. ఇదే సమావేశంలో పాల్గొన్న కేంద్ర గిరిజన, జల వనరులు శాఖామంత్రి విశ్వేశ్వర టుడు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేఈ పాలన అధ్వానంగా ఉందని ఆక్షేపించారు. వ్యవసాయ, ఉపాధి రంగాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని విమర్శించారు. ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. అంతకుముందు టుడు జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ కేంద్రం నిధులతో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్‌పై 5టీ బోర్డు ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే ఆ బోర్డును తొలగించారు. అనంతరం భారతమాల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే బీజేపీ సోషల్ మీడియా విభాగం కార్యకర్తలు, నాయకులతో భేటీ అయ్యారు. సమావేశ లో మాజీ ఎంపీలు బలభద్ర మాఝి, పరశురాం మాఝి తదితర నాయకులు పాల్గొన్నారు.



హాజరైన సోషల్ మీడియా విభాగం ప్రతినిధులు

రైల్వే స్థలాల్లో ఆక్రమణల తొలగింపు

- కట్టుబట్టలతో రోడ్డునపడిన వందకు పైగా కుటుంబాలు

రాయగడ: గత కొన్నాళ్లుగా రైల్వే స్థలాలు ఆక్రమించుకుని, నిర్మించుకున్న నివాసాల తొలగింపునకు రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. రాయగడ రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందడంతో పాటు విజయనగరం నుంచి టిట్లాఘడ్ వరకు మూడో లైన్ నిర్మాణంలో భాగంగా అవసరమయ్యే రైల్వే స్థలాలను సమీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక బొగ్గుల వీధి(కొయిలాపాడ) బస్తీని తొలగించారు. అయితే కొద్ది రోజుల క్రితం ఇదే బస్తీని తొలగించేందుకు వెళ్లిన రైల్వే అధికారులకు చుక్కెదురైంది. చాలా ఏళ్లుగా ఇక్కడే నివాసాలు ఏర్పరుచుకొని జీవిస్తున్నామని, ఒక్కసారిగా ఖాళీ చేయమంటే అంతా ఎక్కడ తల దాచుకుంటామని బాధితులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరికొద్ది రోజులు గడువు ఇవ్వాల్సిందిగా కోరగా.. అంగీకరించిన అధికారులు 15రోజులు వ్యవధి కల్పించారు. గడువు ముగిసినప్పటికీ బస్తీవాసులు స్పందించక పోవడంతో అధికారులు ముందుకు కదిలారు. మంగళవారం నుంచి బస్తీ తొలగించే కార్యక్రమం ప్రారంభించారు. దీంతో సుమారు 100కు పైగా కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. మరోవైపు జిల్లా యంత్రాంగం గతంలోనే స్థానిక పట్టణానికి సమీపంలోని పితామహల్ మౌజా పరిధిలో ఉన్న కోడేసు గ్రామంలో పునరావాసం కల్పించేందుకు స్థలాన్ని కేటాయించింది. అయితే బాధితులు అందుకు ససేమిరా అంగీకరించక పోవడంతో యంత్రాంగం మౌనం వహించింది. అయితే రైల్వే అధికారులు తొలగింపులకు శ్రీకారం చుట్టడంతో నిలువ నీడ కోల్పోయామని, జిల్లా అధికారులు చూపించిన స్థలంలోనే తల దాచుకుంటామని బాధ/ తులు చెబుతున్నారు.



కొయిలాపాడ బస్తీని తొలగిస్తున్న సిబ్బంది

అర్హులను గుర్తించేందుకు..

ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం పట్టణంలోని రైల్వే స్థలాల్లో ఆక్రమించుకుని ఉన్నవారి వివరాలను జిల్లా యంత్రాంగం సేకరించింది. అయితే కొంతమందికి సొంత ఇళ్లు, స్థలాలు ఉన్నప్పటికీ ఇక్కడే ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో అర్హులైన వారికి ప్రభుత్వ స్థలాలను కేటాయించేందుకు సన్నహాలు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ పట్టణంలో ఆక్రమించుకుని ఉన్న రైల్వే స్థలాలను ఖాళీ చేసేందుకు సంబంధిత శాఖ ముమ్మరంగా చర్యలు చేపడుతోంది.



యంత్రాల సాయంతో స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

జాబ్‌మేళా రేపు

పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ బుధవారం తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్కులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాలో పది కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్‌వెబ్ సైట్‌లో విధిగా పేర్లు నమోదు చేసుకుని, రిఫరెన్స్‌నంబర్‌తో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, ఒక పాస్‌ఫొటోతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 63034 93720, 89788 78557 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

పాలకొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బద్దుమహసింగి గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. విద్య, భోజనం, వసతి తీరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎం.సింగుపురం పీహెచ్‌సీని సందర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. సేవలు సక్రమంగా అందడంలేదన్న రోగుల ఫిర్యాదు మేరకు హెడ్‌నర్స్ విజయలక్ష్మికి షోకాజ్ నోటీసు అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓను ఆదేశించారు. డోలమడలో మలేరియా నివారణ చర్యలను పరిశీలించారు. అనంతరం గొట్ట మంగళాపురం గ్రామంలో జగనన్న కాలనీని పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు ఇచ్చారు.

కదిలిన యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: వీరఘట్టం, పాలకొండ మండలాల్లో ఉన్న జగన్నాథస్వామి దేవాలయాల భూముల అన్యాక్రాంతం, భూముల కౌలును సరిగా చెల్లించకపోవడంతో ఆలయాల నిర్వహణ భారంగా మారడంపై సాక్షి దినపత్రికలో 'దేవుడా' శీర్షికన బుధవారం ప్రచురించిన కథనానికి రాష్ట్రదేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ స్పందించారు. ఆలయాల్లో ధూపదీపాల పరిస్థితిపై స్థానిక దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడారు. భూముల వివరాలపై ఆరా తీశారు. తక్షణమే పూర్తి వివరాలు అందజేయాలని ఆదేశించారు.

సమయపాలన తప్పనిసరి



జేవీకే కిట్ల పంపిణీ తీరుపై విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

భామిని: ఉపాధ్యాయులు విధిగా సమయ పాలన పాటించాలని డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. భామిని మండలంలోని బత్తిలి, భామిని ఉన్నత పాఠశాలలు, భామిని కేజీబీవీ, ఎంపీపీ స్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విధులకు ఆలస్యంగా హాజరైన ఉపాధ్యాయులను మందలించారు. జగనన్న విద్యాకానుకల పంపిణీ తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట హెచ్‌ఎంలు ఆర్.వెంకటరమణ, కె.వెంకటరావు, సీఆర్పీ ఎన్.చిన్నబాబు ఉన్నారు.

రాజాంలో గాలివాన



రాజాం-పాలకొండ రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

రాజాం సిటీ: రాజాంలో బుధవారం సాయంత్రం ఈదుదుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాజాం-పాలకొండ రోడ్డులో భారీ వృక్షం విద్యుత్ తీగెలపై పడడంతో రెండు స్తంభాలు ఒరిగిపోయాయి. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విద్యుత్‌శాఖ అధికారులు, పోలీసులు చెట్టును స్థానికుల సహాయంతో తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

సర్పంచ్‌పై దాడి

జామి: మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన సర్పంచ్‌పై దాడి జరిగినట్లు పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నువ్వు పంట ఒక వ్యక్తి దొంగతనం చేశాడన్న బాధితుడి అభియోగం మేరకు సర్పంచ్ ఎ.సుబ్రహ్మణ్యం, గ్రామపెద్దలఆధ్వర్యంలో పంచాయితీ చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు ద్వారపూడి బాలాజీ సర్పంచ్‌పై కత్తితో దాడి చేయబోయాడు. ఈ క్రమంలో సర్పంచ్‌కు రక్షణగా ఉన్న కిలారి వెంకటరమణ గాయపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వివరించారు.

జనరేటర్ చోరీ

బలిజిపేట: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ జనరేటర్ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. దాని ఖరీదు సుమారు రూ.7వేలు ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్టేట్‌బ్యాంక్ మేనేజర్ చెప్పారు.

సంప్రదాయ సందడి



జొరిగాంలో రొజ్జా జరుపుకొంటున్న గిరిజన మహిళలు

● రాష్ట్రవ్యాప్తంగా రొజ్జొ సంక్రాంతి సంబరాలు
● వంటకాలు, ఆటలతో ఉల్లాసంగా మహిళలు

కొరాపుట్: ఉత్కళ ప్రజల సంప్రదాయ పండగ రొజ్జొ గిరిజన ప్రాంతాల్లో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. నవరంగపూర్ జిల్లా జొరిగాంలో గిరిజన మహిళలు ఊయల కట్టి ఉత్సవం జరుపుకొన్నారు. 3 రోజులు జరగనున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా.. తొలి రోజు రొజ్జొ, రెండో రోజు మిథున సంక్రాంతి, మూడో రోజు బుధ జరగనుంది. ఈ రోజుల్లో మహిళలు ఇంటి పనులకు దూరంగా ఉంటారు. సామూహికంగా ఆటలాడటం, స్నేహితులతో కాలక్షేపం, ఊయలలూగుతూ సంతోషంగా గడుపుతారు. రొజ్జొ సందర్భంగా ప్రభుత్వం అధికారిక సెలవు దినంగా ప్రకటించింది.



ఊయల్లో సందడి చేస్తున్న చిన్నారులు, యువతులు

రాయగడలో..

రాయగడ: ఒడియా ప్రజల సంప్రదాయ రొజ్జొ వేడుకలు పట్టణంలో సందడిగా ప్రారంభమయ్యాయి. వీధుల్లో పిల్లలు కొత్త బట్టలు ధరించి ఊయల ఊగుతూ సందడి చేస్తున్నారు. స్థానిక సంస్కృతి మహిళా సంఘానికి చెందిన సభ్యులు రొజొ సందర్భంగా గురువారం నుంచి సంస్కృతి కార్యాలయంలో యువతుల మధ్య మెహందీ, రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నారు.

సంబాద్ సాహిత్య ఘర్ ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: రొజ్జొ సంక్రాంతి సందర్భంగా స్థానిక ఉత్కళ హితేషినీ సమాజ్ భవనంలో సంబాద్ సాహిత్య ఘర్ 11వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఉపాంత ప్రహరీ పూర్ణచంద్ర మహాపాత్రొ ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్రిపతి ప్రసాద్‌పండా స్వాగతోపన్యాసం చేశారు. ప్రాశ్చాత్య సాహిత్యం ఎంతవరకూ మనకు ప్రయోజనం అనే అంశంపై వక్తలు గౌరీహరి పట్నాయక్, ఆశాలతా పాణిగ్రాహి, డా.కల్యాణిమిశ్రా మాట్లాడారు. అనంతరం పలువురు యువతులు రొజ్జొ సంక్రాంతి ఉత్సవం సందర్భంగా పాటలు పాడారు. కార్యక్రమంలో సంబాద్‌సాహిత్య ఘర్ కార్యదర్శి బిచిత్రానంద బెబర్తా ఆధ్వర్యంలో నిర్వహించగా.. మురళీ పారిచ్చా, బినోద్ జెన్నా, పండిత నర్సింహ గౌడొ, విష్ణుపండా పర్యవేక్షించారు.



పర్లాకిమిడి: స్వీయ కవితాలపనలో ఆశాలతా పాణిగ్రాహి



పర్లాకిమిడి: కవితా సంకలాన్ని ఆవిష్కరిస్తున్న బిచిత్రానంద, ఆశాలతా, పూర్ణచంద్ర

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!



లబ్ధిదారుడికి ఇంటి పట్టా అందిస్తున్న ఎంపీ రమేష్ మాఝి

● మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం బాధితులకు ఇంటి పట్టాలు పంపిణీ

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి చిత్తపరి-3 పంచాయతీ సదాశివపూర్ గ్రామంలో 83 కుటుంబాలకు ఇంటి స్థల పట్టాలను నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి బుధవారం అందజేశారు. 1960లో మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం కోసం ప్రభుత్వం స్థలం సేకరించడంతో 259 కుటుంబాలు ఇల్లు, భూములను వదిలి పోవాల్సి వచ్చింది. అప్పట్లో కొరాపుట్ జిల్లాలో పరిధిలో ఉన్న వీరంతా.. సదాశివపూర్‌కు తరలి వెళ్లారు. అప్పటి నుంచి అక్కడే జీవిస్తుండగా.. ప్రభుత్వం ఇస్తామన్న స్థలాలను ఇప్పటివరకు కేటాయించలేదు. దీంతో పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోయింది. విషయం తెలుసుకున్న నవరంగపూర్ ఎంపీ రమేష్‌మాఝి.. సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. జిల్లా యంత్రాంగం తరపున ఇంటి పట్టాలు మంజూరు చేయడంతో పాటు ఆయనే స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ప్రస్తుతం 83 కుటుంబాలకు వీటిని అందించగా, మిగిలిన వారికి కూడా త్వరలోనే అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, మల్కన్‌గిరి జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టంగులు, తహసీల్దార్ పద్మనాబ్ దొర, జిల్లా పరిషత్ సభ్యురాలు లక్ష్మి నాయక్, పంచాయతీ సర్పంచ్ జిత్ బురిడి తదితరులు పాల్గొన్నారు.

పీఈఓ కార్యాలయానికి తాళం



పీఈఓ కార్యాలయం వద్ద సర్పంచ్ సూర్యమణి నాయక్

జయపురం: తమ పంచాయతీలో అభివృద్ధి పనులకు సహకరించడం లేదని ఆరోపిస్తూ పంచాయతీ విస్తరణ అధికారి కార్యాలయానికి వార్డు మెంబర్లు, సర్పంచ్ సూర్యమణి నాయక్ తాళాలు వేశారు. బొయిపరిగుడ పీఈఓ జిబి కద్రక తన గదిలోకి వెళ్లిన కొద్ది సేపటికే ఈ విధంగా చేయడంతో కొద్దిసేపు ఆందోళన నెలకొంది. వెంటనే బొయిపరిగుడ బీడీఓ అభిమన్యు కవి శత్పతి అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో తాళాలు తెరిచారు.

మహిళ దుర్మరణం

● మరో నలుగురికి తీవ్ర గాయాలు
● కారు, బస్సు ఢీకొనడంతో ప్రమాదం

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామం సమీపంలో రోళ్లవాక జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు పట్టణానికి చెందిన నలుగురు మహిళలతో పాటు ఒక వ్యక్తి సాలూరు నుంచి విజయనగరం కారులో వస్తుండగా విశాఖపట్నం నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న సాలూరులోని గొల్లవీధికి చెందిన మారుతి రాజేశ్వరి (60) అక్కడికక్కడే మృతి చెందింది. అదే కారులో ప్రయాణిస్తున్న మీసాల లక్ష్మి, కాకి పార్వతి, మారుతి కల్యాణ చక్రవర్తితో పాటు మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగ్రాతులను 108 వాహనంలో విజయనగరంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.అప్పలనాయుడు పరిశీలించి, ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన రాజేశ్వరి (పచ్చ చీర కట్టుకున్న మహిళ)

గుర్తు తెలియని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: స్థానిక బాలాజీ జంక్షన్ సమీపంలో పెద్దచెరువు గట్టు మీద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. సుమారు 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల వ్యక్తి మృతదేహం గురించి సమీపంలో విచారణ చేయగా యాచక వృత్తి చేస్తూ జీవనం సాగించేవాడని స్థానికులు చెప్పారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కోరారు.

ఊరూరా ఉత్సవం

ఒక కుటుంబం శుభకార్యానికి సిద్ధమయిందంటే ఆ కుటుంబం ఆనందంగా ఉన్నట్టు లెక్క. ఊరంతా కలిసి గ్రామ దేవతల ఉత్సవాలకు సిద్ధమయ్యారంటే ఊరందరూ బాగున్నారని అర్థం. పంటలు కలిసి రావడం, గిట్టుబాటు ధర చేతికి అందడం.. పిల్లల చదువులు చక్కగా సాగడం.. ఉద్యోగాల్లో స్థిరపడడం...పల్లెలు ప్రగతి పథంలో పయనించడం.. కరోనా మహమ్మారి వంటి విపత్తుల నుంచి క్షేమంగా బయటపడడంతో 60 ఏళ్లు, 40 ఏళ్లు, 20 ఏళ్ల మందు జరుపుకున్న గ్రామదేవత ఉత్సవాలను రెండు నెలలుగా సందడిగా జరుపుకుంటున్నారు. సిరిమానోత్సవాలను సంబరంగా నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక చింతనతో గడుపుతున్నారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఊరూరా సాగిన, సాగుతున్న ఉత్సవాలకు 'సాక్షి' అక్షర రూపం.





వీరఘట్టంలో పైడితలమ్మ సిరిమానోత్సవం (ఫైల్) (ఇన్‌సెట్లో)

విజయనగరం డెస్క్:

ఊరి పండగ (గ్రామదేవతల) అంటే ఐక్యతకు ప్రతీక. సంస్కృతి సంప్రదాయాలకు నెలవు. విజయనగరం ఉమ్మడి జిల్లాలోని పల్లెల్లో గత రెండు నెలలుగా గ్రామదేవత ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏ పల్లెలో చూసినా ఉత్సవ సందడి కనిపిస్తోంది. పల్లెప్రజలందరూ గ్రామ దేవతల పండగలో మమేకమవుతున్నారు. దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకుని తమ ఇష్టదైవాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. బంధుమిత్రులతో కలిసి ఆనందంగా గడుపుతున్నారు. అన్నసంతర్పణలు చేస్తున్నారు. అందరూ బాగుండాలని.. అందులో మనముండాలని ఆకాంక్షిస్తున్నారు.

దశాబ్దాల తర్వాత...

చాలా గ్రామాల్లో దశాబ్దాల తర్వాత గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా నిర్వహించాలని భావిస్తున్నా పరిస్థితులు అనుకూలించేవికాదని, ఏదో ఒక అటంకంతో పండగ నిర్ణయం వాయిదా పడేదని, ఇప్పుడు పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొనడం... ఆర్థికోన్నతి చెందడం, అడ్డంకులు లేకపోవడంతో గ్రామ పండగలను వైభవంగా నిర్వహిస్తున్నామని గ్రామపెద్దలు చెబుతున్నారు. మనసంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందజేయాల్సిన బాధ్యత మనపై ఉందని, గ్రామ దేవతలను ఆరాధిస్తే ఊరికి మంచి జరుగుతుందన్న ఉద్దేశంతో నియమనిష్టలతో ఉత్సవాలను జరుపుతున్నట్టు పేర్కొన్నారు. అమ్మవార్లకు ఘటాలతో చల్లదనం చేసి చల్లని ఆశీస్సులు పొందుతున్నామన్నారు.

'చిత్రంలో కనిపిస్తున్నది పార్వతీపురం పట్టణంలో గతనెల 29న జరిగిన గ్రామదేవతల సిరిమానోత్సవం. ఇప్పలపోలమ్మ పండగను 2014 సంవత్సరంలో నిర్వహించారు. మళ్లీ ఇప్పుడు జరుపుకున్నారు. సాంస్కృతి ప్రదర్శనలు, బాజాభజంత్రీలు నడుమ అమ్మవారి సిరిమానోత్సవం, ఘటాల ఊరేగింపును జరిపారు. ఇన్నాళ్ల అన్ని విధాలా పరిస్థితులు అనుకూలించడంతో పండగను వేడుకగా జరుపుకోగలిగామని గ్రామ పెద్దలు తెలిపారు.





64 ఏళ్ల తర్వాత..

చిత్రంలో అసరితల్లి అమ్మవారి పాలజంగిడిని ఊరేగిస్తున్నది పాలకొండ మండలంలోని కొండాపురం గ్రామస్తులు. 64 ఏళ్ల తరువాత గ్రామంలో అసిరితల్లి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా జరిపారు. అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆరు దశాబ్దాల తర్వాత జరిగిన పండగను ప్రతీ కుటుంబం సంబరంగా జరుపుకుంది.

వైభవంగా..



రాజాం మండలం పెనుబాక గ్రామంలో గత నెల 22 నుంచి 30 వరకు తొమ్మిదిరోజుల పాటు గ్రామ దేవత అసిరితల్లి పండగను వైభవంగా నిర్వహించారు. 14 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఉత్సవంలో గ్రామస్తులందరూ మమేకమయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కోలాటం, శక్తివేషాలు, కోయిద్యాన్సులు, తప్పెటగుళ్ల ప్రదర్శనలతో అమ్మవారిని కొలిచారు. అన్ని పరిస్థితులు అనుకూలించడం వల్లే పండగను వైభవంగా నిర్వహించుకోగలిగామని పెనుబాక వాసులు తెలిపారు.

అమ్మవారి చల్లని కరుణతో...



కరోనా మహమ్మారి ముప్పు తొలగింది. పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నవేళ... పండగను నిర్వహించాలని నిర్ణయించాం. గత నెల 28, 29, 30 తేదీల్లో పండగను వైభవంగా నిర్వహించాం. అమ్మవారి ఆశీస్సులు అందుకున్నాం. పండగ నిర్వాహణకు ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరించింది.

– జయబాబు, ఇప్పలపోలమ్మ ఉత్సవ కమిటీ సభ్యుడు, పార్వతీపురం

ఉత్సవం.. సంప్రదాయానికి ప్రతీక



గ్రామదేవత ఉత్సవం ఆ ఊరి సంప్రదాయానికి ప్రతీక. గ్రామ దేవతలను పూజిస్తే మంచి జరుగుతుందన్నది నమ్మకం. పరిస్థితులు అనుకూలించకపోవడంతో పండగను తొమ్మిదేళ్ల తర్వాత నిర్వహించగలిగాం. సిరిమాను అధిరోహించి అమ్మవారి ఆశీస్సులు భక్తులకు అందించిన వేళ కలిగే ఆనందం వర్ణించలేనిది.

– నక్కల శ్రీనువాసరావు, సిరిమాను పూజారి, ఎర్రకంచమ్మ ఆలయం, జగన్నాథపురం

పూర్వ జన్మ సుకృతం



ఎన్నో ఏళ్లుగా సిరిమానును మా కుటుంబ సభ్యులు అధిరోహించడం ఎన్నో జన్మల అదృష్టంగా భావిస్తున్నాను. వివిధ ఆటంకాలతో పండగను ఏళ్లతరబడి నిర్వహించకపోవడంతో సిరిమానును అధిరోహించలేదు. ప్రస్తుతం ప్రజలంతా ఆనందంగా, సుఖసంతోషాలతో ఉండడంతో గ్రామ పెద్దలు పండగను జరపడానికి నిర్ణయించారు. దీంతో ఈ ఏడాది సిరిమానును అధిరోహించాను.

– ఆరికి రాజారావు, సిరిమాను పూజారి, ఇప్పలపోలమ్మ ఆలయం

పార్వతీపురం మన్యం జిల్లాలో ఇటీవల జరిగిన గ్రామదేవత ఉత్సవాలు ఇలా..

- పార్వతీపురం జగన్నాథపురం గ్రామ దేవత అయిన ఎర్రకంచమ్మ పండగను ఏడేళ్ల తర్వాత నిర్వహించారు.
- పార్వతీపురం బెలగాం గ్రామదేవతైన బంగారమ్మ తల్లి పండగను కూడా ఏడేళ్ల తర్వాత గత నెలలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.
- 2012లో నిర్వహించిన సీతానగరం మండలం పెదబోగిల గ్రామదేవతైన బోగితల్లి పండగను ఇటీవల వైభవంగా నిర్వహించారు.
- సీతానగరం మండలం దయానిధి పురం గ్రామంలో ఏడేళ్ల కిందట నిర్వహించిన పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను 2023 ఏప్రిల్ నెలలో నిర్వహించారు.
- పాలకొండ మండలం పొట్లి గ్రామంలో 50 ఏళ్ల తరువాత బంగారమ్మ గ్రామ దేవత ఉత్సవాలను అంగరంగ వైభంగా 11 రోజుల పాటు నిర్వహించారు.
- వీరఘట్టం గ్రామ దేవత అయిన పైడితల్లమ్మ ఉత్సవాలను ఏడేళ్ల తరువాత భక్తి శ్రద్ధలతో వైభవంగా మే నెలలో నిర్వహించారు.



రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

సంతకవిటి: మండలంలోని నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఈబీ ఎస్సై పిచ్చేశ్వరరావు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి మల్లయ్యపేట మీదుగా ఇసుకను తరలిస్తున్నారన్న విషయం తెలుసుకుని దాడిచేసి పట్టుకుని సంతకవిటి పోలీస్‌స్టేషన్‌కు ట్రాక్టర్లను అప్పగించగా కేసు నమోదుచేశారని తెలిపారు.

భర్త వేధింపులు



చికిత్స పొందుతున్న శ్రావణి

పార్వతీపురం: అదనపు కట్నం కోసం భర్త తన భార్యను వేధిస్తున్న సంఘటన పార్వతీపురం పట్టణంలో వెలుగుచూసింది. ఈ మేరకు పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణానికి చెందిన గుడ్ల శ్రావణికి రవితేజతో వివాహమై తొమ్మిదినెలలవుతోంది. వివాహ సమయంలో 14తులాల బంగారం రెండు లక్షల నగదు, పెండ్లి కుమారుడికి బ్రాస్‌లెట్ శ్రావణి తల్లిదండ్రులు ఇచ్చారు. వివాహమైన తరువాత భార్యభర్తలు హైదరాబాద్‌లోని అన్నాజిగూడలో అద్దెకు ఉండేవారు. భర్త రవితేజ అదనపు కట్నం తేవాలని, నిత్యం భార్యను హింసించేవాడు. ఈ విషయం పెద్దల సమక్షంలో రెండుసార్లు చర్చలు జరిపి రాజీ చేశారు. అయినా భర్తలో ఎలాంటి మార్పు రాలేదు. ఇటీవల మళ్లీ భార్యను కొట్టి హింసించేవాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆమె హైదరాబాద్‌నుంచి పార్వతీపురం కన్నవారింటికి వచ్చి తీవ్ర అనారోగ్యం కారణంగా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం చేరింది.

క్లుప్తంగా

అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్టే..

● స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి



అనుగ్రహభాషణ చేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి

శ్రీకాకుళం కల్చరల్: అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి అన్నారు. శ్రీకాకుళంలోని నానుబాలవీధి విజయదుర్గా ఆలయంలో జరుగుతున్న రాజశ్యామల యాగ మహోత్సవంలో భాగంగా బుధవారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుగ్రహణ భాషణ చేస్తూ సృష్టికి ప్రతిసృష్టి చేసేది అమ్మవారని, ఆమెను ఆరాధించే వారికి ఎటువంటి ఆటంకాలు ఉండవన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హోమంలో పాల్గొన్నారు. అమ్మవారిని రకరకాల పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి సూర్యనారాణశర్మ, ఫణికుమార్‌శర్మ, కమిటీ సభ్యులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీడి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని సీపీఎం, వామపక్ష నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్ ధరి జ్యోతి రావుఫూలే పార్కు వద్ద జీడి రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారంచాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈనెల 28న రౌండ్ టేబుల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని జీడి పంటకు మద్దతు ధర ప్రకటిస్తూ కేంద్రానికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.గోవిందరావు, బైరి కృష్ణమూర్తి, తాండ్ర ప్రకాశ్, జీడి కార్మికులు ఉన్నారు.

మార్కెట్‌లోకి 'ఫ్యాషన్ ప్లస్'



కొనుగోలుదారుడికి తాళం అందజేస్తున్న ఎస్సై లక్ష్మణరావు, ఎండీ ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సరికొత్త ఫీచర్స్‌తో గేమ్ చేంజర్‌గా ఫ్యాషన్ ప్లస్ టు వీలర్ మార్కెట్‌లోకి తీసుకురావడం శుభ పరిణామమని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై ఎన్.లక్ష్మణరావు అన్నారు. దేశంలోనే ద్విచక్ర వాహన రంగంలో నంబర్ వన్ సంస్థ హీరో మోటోకార్ప్ సరికొత్త ఫ్యూచర్స్‌తో ఫ్యాషన్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్రీకాకుళంలోని వరం ఆటోసెంటర్‌లో ఫ్యాషన్ ప్లస్ పరిచయ.. ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఆటో సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ అంధవరపు ప్రసాదరావుతో కలిసి ఎస్సై లక్ష్మణరావు మొదటి వాహన కొనుగోలుదారుడికి తాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంధవరపు శంకరరావు, హీరో నెట్వర్క్ సేల్స్ మేనేజర్ మణికంఠ, వరం ఆటో సెంటర్ సేల్స్ మేనేజర్ మొదలవలస శ్రీనివాసరావు, అకౌంట్స్ మేనేజర్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆర్‌ఐఓగా దుర్గారావు



పి.దుర్గారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్‌ఐఓగా పి.దుర్గారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. దుర్గారావు జలుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. తాజాగా పూర్తి అదనపు బాధ్యతలతో ఆర్‌ఐఓగా నియమించారు. రెండున్నరేళ్లగా ఆర్‌ఐఓగా పనిచేస్తున్న ఎస్.తవిటినాయుడు ఇకపై సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తిస్థాయిలో పనిచేయనున్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించడంతోపాటు వారిని ఎస్ఎఫ్‌సీ (షెడ్యూల్ ఫిషర్‌మెన్ కాస్టు) రిజర్వేషన్‌లో చేర్పించాలని సంబంధిత నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని జ్యోతిరావుపూలే జంక్షన్ వద్ద మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సముద్రంపై, తీర ప్రాంత భూములపై హక్కులు కల్పించాలని, ఫిషింగ్ జెట్టీల నిర్మాణం చేయాలని, మత్స్యకారులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఏటా రూ. రెండు వేల కోట్లు మత్స్యకార సంక్షేమానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కాగా దీక్షను విరమించాలని ఒకటో పట్టణ పోలీసులు మత్స్యకారులకు విజ్ఞప్తి చేయగా..వారు పట్టించుకోలేదు. దీంతో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించగా.. అక్కడ కూడా నిరసన తెలియజేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. దీక్షల్లో మత్స్యకార సంఘం నాయకులు చింతపల్లి సూర్యానారాయణ, చీగటి శ్రీరాములు, సూరాడ చంద్రమోహన్, రాంబాబు, యర్రయ్య, మైలపల్లి త్రినాథ్, మైలపిల్లి నర్సింగరావు, కానాడ చిన్నారావు ఉన్నారు.

పానీయం.. పోషకప్రియం



జిగర్తండ తాగేందుకు ఉత్సాహం చూపుతూ..

ఎండలు మండిపోతున్నాయి. జూన్ నెల మధ్యలోకి వచ్చినా తగ్గని ఉష్ణతాపం.. ఎన్నిసార్లు నీళ్లు తాగినా తీరని దాహం. నీళ్లు కూడా వేసవి తాపానికి వేడెక్కి తాగలేని విధంగా తయారవుతున్నాయి. పైగా పదే పదే నీళ్లు తాగలేని పరిస్థితి. దాంతో బయట లభించే ఫలరసాలు, పానీయాల పైకి ప్రజల దృష్టి మళ్లుతోంది. వినియోగదారుల ఆసక్తిని, అభిరుచిని గుర్తించి పానీయాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. పోషక విలువలతో కూడిన పలు కొత్త రకాల పానీయాలను వ్యాపారులు అందుబాటులోకి తెస్తూ వినియోగదారుల దాహార్తిని, జిహ్వాచాపల్యాన్ని తీరుస్తున్నారు.



- ప్రత్యేక పానీయాలపై నగరవాసి మొగ్గు
- పుష్కలమైన పోషకాలు.. పసందైన రుచులు
- దాహార్తి తీరడంతో పాటు మరెన్నో ప్రయోజనాలు

శ్రీకాకుళం డెస్క్: మండే ఎండలకు ప్రత్యేక పానీయాలు రా.. రమ్మని పిలుస్తున్నాయి. దాహార్తి తీర్చడంతో పాటు శరీరాన్ని చల్లబరిచేలా వివిధ డ్రింక్స్ వేసవి తాపానికి చెక్ పెడతానంటున్నాయ్. పాలు, సేమ్యా, సబ్జా వంటివి వినియోగించి తయారు చేసే ఈ పానీయాల్లో పోషకాలు పుష్కలంగా ఉండడంతో నగరవాసులు వీటిని తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఠండా.. జిగర్తండ

పేరులాగానే దీని రుచి కూడా విభిన్నమే. ఇది కూడా బలవర్ధకమైన పోషకాలు అందించే పానీయం. తమిళనాడులోని మధురై నగరంలోని ప్రఖ్యాత పానీయం. దీని తయారీలో బాదమ్, నన్నారీ షర్‌బత్, రెడ్యూస్డ్ మిల్క్, ఐస్‌క్రీమ్‌లను వినియోగిస్తారు. శరీరాన్ని చల్లబరుస్తుంది.

ఇందులో నార్మల్, స్పెషల్ రెండు రకాలున్నాయి.

ధరలు: రూ.70 నుంచి రూ.140 వరకు ఉన్నాయి.

విక్రయాలు ఎక్కడ: సరస్వతీ మహల్ జంక్షన్‌లో..



భలే బాదం

బాదం పప్పు, పాలతో తయారు చేసే పానీయం ఇది. ఎండలో దీనిని రుచి చూస్తే ఆ కిక్కే వేరు. ఏడు రోడ్ల కూడలికి సమీపంలోని ఓ దుకాణంలో విక్రయించే బాదం పాలుకు విపరీతమైన గిరాకీ.

ఇందులో నార్మల్, స్పెషల్ రెండు రకాలున్నాయి.

ధరలు: రూ.25

విక్రయాలు ఎక్కడ: పాన్‌షాపులు, కూల్ డ్రింక్‌లు విక్రయించే దుకాణాల్లో..

పోషకాల ఫలూదా..

అత్యధికంగా అమ్ముడయ్యే పానీయాల్లో ఇదొకటి. పాలు, సేమ్యా, సబ్జా, డ్రైఫ్రూట్స్, ఐస్‌క్రీమ్‌ల మిక్సింగ్‌తో తయారయ్యే ఫలూదాలో పోషక విలువలు మెండు. సిక్కోలు వ్యాపారులతో పాటు రాజస్తాన్ బళ్ల వ్యాపారులు కూడా దీనిని విక్రయిస్తున్నారు. వినియోగదారుడి టేస్ట్‌ని బట్టి ఐస్‌క్రీమ్ ఫ్లేవర్లు, డ్రైఫ్రూట్స్‌ను జత చేసి అందజేస్తున్నారు. ఒక ఫలూదా 1000 క్యాలరీల వరకు శక్తినిస్తుంది.

ఇందులో నార్మల్, స్పెషల్ రెండు రకాలున్నాయి.

ధరలు: రూ.50 నుంచి రూ.150 వరకు ఉన్నాయి.

విక్రయాలు ఎక్కడ: నగరంలోని అన్ని ముఖ్య కూడళ్లలో..



కారం మజ్జిగ..



ఇది సిక్కోలు హాట్ ఫేవరెట్. లోకల్ మేడ్ కూడా. కరివేపాకు, అల్లం, పచ్చిమిర్చి వేసిన మజ్జిగను మండుటెండలో తాగితే ఆ రుచే వేరు. అర లీటర్ బాటిళ్లలో విక్రయిస్తున్నారు. నగర వ్యాప్తంగా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మండుటెండకు చాలా మంచి పానీయం. ఇంట్లో కూడా తయారు చేసుకుని తాగొచ్చు.

ధర: రూ.20



చల్లని చెరుకు రసం

చెరుకు రసం అనగానే రోడ్ల పక్కన మోటారు పొగతో.. గ్రీజ్ పూసిన యంత్రాల పళ్లవరుసల మధ్య చెరుకును పెట్టి రసం తీయడం అనుకుంటున్నారా..అది కాదండోయ్.. ఇప్పుడు పూర్తిగా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన మిషన్ వచ్చేసింది. చెరుకును శుభ్రపరిచి ముక్కలుగా చేసి ఇందులో పెడితే.. కూల్ అయిన రసం తాగేందుకు సిద్ధమవుతుంది. ఇందులో కూడా సేంద్రీయ విధానంలో పండించిన చెరుకును వినియోగిస్తున్నారు.

ధర: 200 మిల్లీలీటర్ల గ్లాస్ రూ.20

చలవకు సబ్జా

సబ్జా గింజలు, నిమ్మకాయ, పంచదారను వినియోగించి ఈ పానీయాన్ని తయారు చేస్తున్నారు. 150 మిల్లీలీటర్ల బాటిళ్లలో విక్రయిస్తున్నారు. అదనపు రుచి కోసం ఫ్లేవర్స్ యాడ్ చేస్తున్నారు. శరీరం సత్వరం చల్లబడేందుకు ఉపకరిస్తుంది. ఇంట్లో కూడా తయారు చేసుకోవచ్చు.

ధర: రూ.25

విక్రయాలు ఎక్కడ: కూల్ డ్రింక్‌లు అమ్మే దుకాణాల్లో



పిడుగుపాటుకు గొర్రెల కాపరి బలి



ఎర్రయ్య మృతదేహం

మందస: పిడుగుపాటుకు గొర్రెల కాపారి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మూలిపాడు పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామం సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకోగా బతకల ఎర్రయ్య (68) మరణించాడు. సోంపేట మండలం కొర్లాం గ్రామానికి చెందిన ఎర్రయ్య మందస మండలం సరిహద్దు ప్రాంతమైన గోపాలపురం సమీప పొలాల్లో గొర్రెలు మేపుతుండగా ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా మెరుపులు, ఉరుములు వచ్చాయి. దీంతో సురక్షిత ప్రాంతానికి గొర్రెలను ఎర్రయ్య తోలుకుని వెళ్తుండగా అతనిపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మరణించాడు. మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ఎర్రయ్య కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతునికి భార్య నరసమ్మ, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రైలు నుంచి జారిపడ్డాడు.. 108 వాహన సిబ్బంది సేవలందించారు..

కాశీబుగ్గ: రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతనికి 108 వాహన సిబ్బంది చికిత్స అందించి ప్రాణభిక్ష పెట్టారు. ఈ సంఘటన పలాస మండలం సున్నాదేవి రైల్వేస్టేషన్ రైలు గేటు సమీపంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. చెన్నైకు చెందిన ఎండీ కుర్బాన్ ఎర్నాకులం-పాట్నా రైలు నుంచి జారి పడిపోవడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పలాస 108 వాహన సిబ్బంది సిబ్బంది పి.సత్యం, వి.అప్పన్న సంఘటనా స్థలానికి చేరుకుని కుర్బాన్‌కు ప్రథమ చికిత్స చేసిన అనంతరం పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.



కుర్బాన్‌కు చికిత్స చేస్తున్న 108 వాహన సిబ్బంది

పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

● పోలీసుల అదుపులో ముగ్గురు

ఇచ్ఛాపురం: పశువుల అక్రమ రవాణాను ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. టౌన్ ఎస్సై కె.గోవిందరావు, సిబ్బంది జాతీయ రహదారి-16పై బెల్లుపడ, ఈదుపురం కూడలిలో బుదవారం వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి బొలెరో వాహనంలో పది పశువులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. వెంటనే వాహనాన్ని ఆపి విచారించగా పశువులను కంచిలి వద్ద నిర్వహిస్తున్న సంతలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్టు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో పశువులను స్వాధీనం చేసుకొని సంరక్షణ నిమిత్తం వాటిని బారువా వద్ద గల గోశాలకు తరలించారు. పశువులను తరలించేందుకు వినియోగించిన వాహనంతో పాటు ఒడిశాలోని డెంగాపదరో గ్రామానికి చెందిన సహస్రాన్స్ నాయక్, బిక్రమ్ నాయక్, రజనీ నాయక్‌లను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

'నీట్'గా మెరిశారు

● పాతపట్నానికి చెందిన యశశ్రీకి 40వ ర్యాంకు



యశశ్రీని అభినందిస్తున్న తల్లిదండ్రులు

పాతపట్నం/కొత్తూరు: పాతపట్నం యశోదనగర్‌కు చెందిన కాని యశశ్రీ నీట్ (యూజీ) 2023 పరీక్ష ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 40వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో 2వ ర్యాంకు సాధించింది. 720 మార్కులకు 710 సాధించి సత్తాచాటింది. పదో తరగతి నుంచి ఇంటర్ వరకు విజయవాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివింది. ఇంటర్‌లో వెయ్యికు 968 మార్కులు తెచ్చుకుంది. అలాగే ఏపీ ఎంసెట్‌లో 48వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 83వ ర్యాంకు సాధించింది. ఈమె తండ్రి గురువులు కొత్తూరు మండలం కురిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా తల్లి కుసుమకుమారి గృహిణి. ఈ సందర్భంగా యశశ్రీ మాట్లాడుతూ న్యూరో ఫిజీషియన్‌గా స్థిరపడాలని ఉందన్నారు.

జాహ్నవికి 274వ ర్యాంకు



యాబాజీ జాహ్నవి

పాతపట్నం: పాతపట్నం గణేష్‌నగర్‌కు చెందిన యాబాజీ జాహ్నవి ఆలిండియాస్థాయిలో 274వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 54వ ర్యాంకు సాధించింది. ఈమెకు 700 మార్కులు వచ్చాయి. మూడు నుంచి ఏడో తరగతి వరకు పాతపట్నంలో, ఎనిమిది నుంచి టెన్త్ వరకు విశాఖలోని ఓ ప్రైవేటు పాఠశాలలో, ఇంటర్‌ను విజయవాడలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివింది. తండ్రి శాంతిరాజు, తల్లి రమాలతలు ఓ ప్రైవేటు కళాశాల డైరెక్టర్లు. న్యూరో ఫిజీషియన్‌గా స్థిరపడతానని జాహ్నవి 'సాక్షి'కి తెలిపారు.

ముఖ వర్చస్సు ఉపాధి ఉషస్సు



- ముఖ సౌందర్యంపై పెరుగుతున్న మోజు
- ఉపాధి మార్గంగా బ్యూటీ పార్లర్లు
- శుభకార్యాల సమయంలో భలే డిమాండ్
- జిల్లాలో 2వేల మందికి పైగా ఉపాధి





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : వివాహం, నిశ్చితార్థం, ఆఫ్ శారీ ఫంక్షన్, పుట్టిన రోజు వేడుకలు, పండగలు, ఇతరత్రా ఉత్సవాలు.. ఇలా ప్రత్యేక సమయాల్లో అందరి కంటే ప్రత్యేకంగా కనిపించాలని ఎవరైనా కోరుకుంటారు. దీనికోసం ఎంతైనా ఖర్చు పెడుతుంటారు. ఇలాంటి వారికోసమే జిల్లావ్యాప్తంగా బ్యూటీపార్లర్లు, ప్రత్యేకమైన సెలూన్లు వెలిశాయి. ఈ రంగంపై ఆధారపడి జిల్లాలో సుమారు రెండు వేల మంది ఉపాధి పొందుతున్నారు.

పల్లెలకు పాకిన కల్చర్..

మహానగరాల నుంచి నేడు మారుమూల పల్లెలకు సైతం ఈ సంస్కృతి శరవేగంగా పాకింది. పెద్ద పెద్ద కుటుంబాలకే మాత్రమే పరిమితమైన బ్యూటీపార్లర్ కల్చర్ ఇప్పుడు సామాన్యులను సైతం ఆకర్షిస్తోంది. డబ్బుతో ఏముంది.. మళ్లీ సంపాదించుకోవచ్చని, ప్రత్యేక సందర్భాలలో ప్రత్యేకంగా కనిపించాలనే ఆసక్తితో యువతులు, మహిళలు వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఐబ్రోస్, ఫేషియల్, బ్రైడల్ మేకప్, శారీ డ్రాపింగ్, పెడిక్యూర్, మేనిక్యూర్, గోల్డెన్ ఫేషియల్, సిల్వర్ ఫేషియల్, హెడ్ మసాజ్, వ్యాక్స్, మెహందీ, హెయిర్‌స్పా, హెయిర్ కట్స్, ప్రిఫరబుల్ కాస్ట్యూమ్‌లతో అందాన్ని మరింతగా తీర్చిదిద్దుకుంటున్నారు.

ఉపాధి కోణం..

నేడు ఫ్యాషన్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలు పెరిగాయి. వీటిని యువకులు, మహిళలు అందిపుచ్చుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. విశాఖపట్నం, ముంబై, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్ తదితర ప్రాంతాలలో ప్రత్యక్ష శిక్షణతో పాటు ఆన్‌లైన్ వేదికగా శిక్షణ పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యూటీ పార్లర్లను ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందుతూ మరి కొంత మందికి ఉపాధి మార్గం చూపుతున్నారు. ఒక్కొక్క మేకప్‌కు వారు వినియోగించే క్రీమ్‌లు ఇతర సౌందర్య సాధనాలు.. కేటాయించే సమయాన్ని బట్టీ రూ.500 నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆర్థికంగా స్థిరపడిన వారి ఇళ్లలో ఫంక్షన్‌లు అయితే మేకప్ కోసం రూ.లక్షల్లో తీసుకున్న సందర్భాలు సైతం ఉంటున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల మంది ఈ రకమైన వృత్తిలో ఉన్నారు.

పురుషుల్లోనూ పెరిగిన ఆసక్తి



మహిళల మాదిరిగానే పురుషులు కూడా అందం పెంచుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. యువత ఫేషియల్స్, స్క్రబ్స్ వంటివి చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వివాహాల సమయంలో ఫేషియల్, హెయిర్ స్టైల్స్, ఫేస్ ప్యాక్స్ వంటివి చేసుకుంటున్నారు. వాడే కాస్ట్యూమ్స్ మేరకు రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటున్నాం.– తోటపల్లి శ్రీనివాసరావు, వీనస్ సెలూన్, బొందిలీపురం


భలే డిమాండ్.



ప్రస్తుతం ఈ రంగంలో అవకాశాలు ఉన్నాయి. ఎక్కువగా పెళ్లిళ్లు, ఆఫ్‌శారీ ఫంక్షన్లు, నిశ్చితార్థం, పుట్టిన రోజు వేడుకలు, పండగల సమయంలో భలే డిమాండ్ ఉంది. ముఖ స్వభావం బట్టీ క్రీమ్‌లు వినియోగిస్తాం. మేకప్ చేయడానికి గంటల సమయం పడుతుంది. వినియోగించే క్రీమ్‌లు, కేటాయించే సమయం బట్టీ డబ్బులు తీసుకుంటాం.

– ఎస్.లావణ్య, బ్యూటీషియన్, వజ్రపుకొత్తూరు మండలం

ఎంతో మందికి ఉపాధి



ముఖ సౌందర్యంపై ఆసక్తి పెరగడంతో మాకు ఉపాధి దొరుకుతోంది. ఐబ్రోస్, ఫేషియల్, హెయిర్‌కట్, హెయిర్ స్పా, పెడిక్యూర్, మేనిక్యూర్, వ్యాక్సింగ్ తదితర ప్రక్రియ ద్వారా అందంగా తయారు చేస్తున్నారు. వివాహాలకైతే మేకప్, శారీ డ్రాపింగ్, హెయిర్ స్టైల్, ఫేస్ మేకప్, బ్రైడల్ మేకప్, మెహిందీ, ప్రిఫరబుల్ కాస్ట్యూమ్ తదితర విధానాల ద్వారా ముస్తాబు చేసేందుకు రూ.5 వేల నుంచి రూ.50వేలు వరకు తీసుకున్న సందర్భాలు ఉన్నాయి.

– రాయవలస పార్వతి, పరిన్య బ్యూటీ క్లినిక్, శ్రీకాకుళం

నీలమణిదుర్గ ఆదాయం రూ.10.22 లక్షలు




పాతపట్నం: పాతపట్నంలో కొలువైన ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.10,22,073 ఆదాయం వచ్చిందని ఈవో టి.వాసుదేవరావు చెప్పారు. శ్రీకాకుళం దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్ రవికుమార్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 29 రోజులకు గాను ఈ ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్లు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కూర్మజయంతి నేడు



గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలో గురువారం కూర్మ జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జి.గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు తెలిపారు. జ్యేష్ఠ బహుళ ద్వాదశి పర్వదినం సందర్భంగా వసంత కలశాభిషేకం, శీతల నైవేద్యం, నవకలశ స్థపన, తిరుమంజనం, శ్రీస్వామి వారి అవతార ఘట్ట విన్నపం, మహా నైవేద్యం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి ఆదిత్యాలయంలోని అనివెట్టి మండపంలో బుధవారం ఉదయం ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో సూర్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. జ్యేష్ఠ బహుళ (మతత్రయ) ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పలువురు భక్తులు రూ.500 చెల్లించి కల్యాణసేవలో పాల్గొనగా..స్వామివారి శేషవస్త్రాలు, కల్యాణ తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, షణ్ముఖ శర్మ త పాల్గొన్నారు.